క్లుప్తంగా

4 నుంచి కరకచెట్టు పోలమాంబ మహోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ రమేష్

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులోని కరకచట్టు పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఏప్రిల్ 4 నుంచి నిర్వహించనున్నట్లు సీతమ్మధార మండల తహసీల్దార్ ఎం.రమేష్ తెలిపారు. జాతర ఏర్పాట్లపై గురువారం దేవాలయంలో కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఏప్రిల్ 4 నుంచి మే 6 వరకు సాగే జాతర మహోత్సవాల్లో ఏప్రిల్ 14న తొలేళ్ల ఉత్సవం, 15న అనుపు ఉత్సవం, 22న మారువారం, 26న మహాన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ, గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు బి.తవిటి రెడ్డి, మూడో పట్టణ సీఐ పైడయ్య, ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్స్ జోలికి వెళ్లొద్దు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జన జాగరణ సమితి ప్రతినిధులు

మద్దిలపాలెం: ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా జన జాగరణ సమితి ప్రతినిధులు గురువారం మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులోని అలయన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, యువత చేత ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లొదని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే 1500 మందికి పైగా ఆన్‌లైన్ బెట్టింగ్ ఊబిలో పడి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధిస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జన జాగరణ సమితి విశాఖ మహానగర కన్వీనర్ చింతపల్లి సునీల్‌కుమార్, నాయకులు దేవర శంకర్, హరికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'భూగర్భ శాస్త్ర పద్ధతులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలోని భూగర్భ శాస్త్ర విభాగంలో 'మైనింగ్ భూగర్భ శాస్త్ర పద్ధతులు – ఖనిజ నిల్వల అంచనా' అనే పుస్తకం ఆవిష్కరణ గురువారం జరిగింది. ముఖ్య అతిథి ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు, నేటి తరం అధ్యాపకులకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత పి.ఎస్.ఎన్.మూర్తిని రిజిస్ట్రార్ సన్మానించారు. కార్యక్రమంలో భూగర్భ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.ఎస్.ఎన్.రెడ్డి, విభాగ సభ్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి



సీఎస్ విజయానంద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు ఏపీజేఏసీ రాష్ట్ర చైర్మన్ కె.వి.శివారెడ్డి, డిప్యూటీ సెక్రటరీ విద్యాసాగర్‌లతో కలిసి గురువారం వినతిపత్రం అందించామని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారిస్తామని హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎ.రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలకవర్గ సభ్యులు అనంత రాములున్నారు.

వేడుకలకు C/O శివాజీ పార్క్

అకేషన్ ఏదైనా.. లొకేషన్ ఇదే

శివాజీ పార్క్‌ను జీవీఎంసీ పూర్తిస్థాయిలో సరికొత్తగా తీర్చిదిద్దడంతో ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ప్రీ వెడ్డింగ్, పుట్టిన రోజు వేడుకలు, వార్షికోత్సవాలు ఇలా అకేషన్ ఏదైనా.. శివాజీ పార్క్‌నే లొకేషన్‌గా ఎంచుకుంటున్నారు. రోజూ పదుల సంఖ్యలో కొత్తజంటలు ఉదయాన్నే పార్క్‌కు చేరుకొని ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్‌లు జరుపుకుంటున్నాయి. చిన్నారుల బర్త్‌డే వేడుకలకు, లఘుచిత్రాల షూటింగ్‌లకు, మహిళల వాట్సాప్ రీల్స్‌కు ఇక్కడ సౌకర్యాలు, పార్క్ అందాలు అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం ఈ పార్క్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది.



శివాజీ పార్క్ ముఖద్వారం



పార్క్‌లో చిన్నారి బర్త్‌డే ఫొటోషూట్



ఆకర్షణీయంగా డాల్ఫిన్ ఫౌంటెయిన్



(ఫైల్)

సీబీఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి





ఫొటో షూట్‌లో కొత్తజంటలుక్

జోరుగా ప్రీ వెడ్డింగ్, బర్త్‌డే ఫొటోషూట్‌లు

ఉద్యానవన అందాలకు నగరవాసులు ఫిదా

పార్క్‌లో ప్రీ వెడ్డింగ్ ఫొటోషూట్

అసోసియేషన్ల సమావేశాలు, పూర్వ విద్యార్థుల కలయికలకు వేదిక

కుటుంబ సమేత కార్యక్రమాలకు ఆదరణ

ఎంవీపీకాలనీ: నగరవాసుల ఇళ్లలో వేడుక ఏదైనా.. వేదికగా శివాజీ పార్క్ నిలుస్తోంది. ఈ ఉద్యానవనంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా గడిపేందుకు, వేడుకలు జరుపుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడ ప్రీ వెడ్డింగ్, బర్త్‌డే ఫొటోషూట్‌లు జోరుగా సాగుతున్నాయి. ఆయా సంఘాల సమావేశాలు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలు పార్క్‌లో సందడిగా నిర్వహిస్తున్నారు.

రూ.2 కోట్లతో ఆధునికీకరణ

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకొని శివాజీ పార్క్‌ను జీవీఎంసీ పూర్తిస్థాయిలో ఆధునికీకరించింది. రూ.1.5 కోట్లతో పార్కును అభివృద్ధి చేసి గతేడాది అందుబాటులోకి తెచ్చింది. పార్క్ ముఖద్వారం ఆధునికీకరణ, ఫ్లోరింగ్, సెంటర్ ప్లాజా, ఫొటోషూట్ పాయింట్స్ ఆధునికీకరణ, టైల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, లైటింగ్స్‌తో తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ ప్లే ఏరియా, జిమ్‌లను అందంగా మలిచారు. ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పార్క్‌లోని వాటర్ ఫౌంటెయిన్లను రూ.50 లక్షలతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఈ ఫౌంటెయిన్ల సముదాయం మధ్యలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిల్పం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు

నిజానికి శివాజీ పార్క్‌కు ప్రజాదరణ తక్కువ. మద్దిల పాలెం, పెద వాల్తేర్, ఎంవీపీ కాలనీలకు మధ్యలో ఈ పార్క్ ఉండటంతో ఆయా ప్రాంతాల వారే ఎక్కువగా ఇక్కడికి వస్తుంటారు. ఆధునికీకరణ తరువాత దీనికి భిన్నంగా నగర ప్రజలు శివాజీ పార్క్‌ను సందర్శిస్తున్నారు. వేడుకలు, ఫొటోషూట్‌లకు అనుకూలంగా ఉండటంతో ఇక్కడే వాటిని నిర్వహిస్తున్నారు. పార్క్ ప్రవేశ రుసుంగా పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5 వసూలు చేస్తున్నారు. ఫొటోషూట్‌ల కోసం వచ్చే వారికి కెమెరాకు రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. దూరప్రాంతాలకు, ఫొటో స్టూడియోలకు వెళ్లే కంటే శివాజీ పార్క్‌లో ఫొటోషూట్ చేసుకుంటే తక్కువ ఖర్చుతో మంచి ఫలితం వస్తుందనే భావన అందరిలో నెలకొంది. కుటుంబ సమేతంగా జరుపుకునే పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి వేడుకలు, చిన్న చిన్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు తక్కువ ఖర్చుతో నిర్వహించేందుకు వీలుండటంతో శివాజీ పార్క్‌కు ఆదరణ పెరుగుతోంది.

పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



శివాజీ పార్క్‌లో జ్యూట్ బ్యాగ్‌లు అందిస్తున్న సోమన్నారాయణ తదితరులు

ఎంవీపీకాలనీ: శివాజీ పార్క్‌లో గురువారం జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ ఆర్.సోమన్నారాయణ అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతరించిపోతున్న పిచ్చుకలను సంరక్షించడం ప్రజలందరి బాధ్యతని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల పాత్ర కీలకమన్నారు. పిచ్చుకల సంరక్షణ దిశగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ సూచనలకు అనుగుణంగా జేడీ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అవగాహన సదస్సులు అభినందనీయమన్నారు. పిచ్చుకలతోపాటు మరిన్ని పక్షి జాతుల సంరక్షణకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శివాజీ పార్క్ సందర్శకులకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో నాగేశ్వరరావు, సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ అను, విశాఖ కన్వీనర్ సలాది కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పక్షుల చిత్రాలను తిలకిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: జీవ వైవిధ్య పరిరక్షణలో పిచ్చుకల స్థానం ఎంతో కీలకమని జీవీపీ ఎంఎల్‌బీటీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.మధురవాణి అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులోని పాఠశాల పరిసరాల్లో పక్షుల కోసం నీటి పాత్రలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, ఉపాధ్యక్షులు డి.దక్షిణామూర్తి, డి.వి.ఎస్.కామేశ్వరరావు, పి.రాజగణపతి పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీసాయి వెటర్నరీ కాలనీ, చలపతినగర్, సంజీవినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ పేరు తొలగించడం నీచమైన చర్య

బీచ్‌రోడ్డు: విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించడం కూటమి ప్రభుత్వం నీచమైన చర్యని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ విశాఖలో క్రికెట్ స్టేడియం ఏర్పాటులో వైఎస్సార్ కృషి చాలా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ పేరును, విగ్రహాలను తొలగించడం కేవలం శునకానందం పొందడం కోసం మాత్రమేనని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి మహానేత వైఎస్సార్ విశేష కృషి చేశారన్నారు. అచ్యుతాపురం సెజ్, ఫార్మా సెజ్, గంగవరం పోర్టు, హెల్త్ సిటీ, విమ్స్ ఆస్పత్రి వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్ హాయంలోనే జరిగాయని తెలిపారు. అటువంటి వ్యక్తి పేరును తొలగించడం పనికిమాలిన చర్యగా అభివర్ణించారు. వైఎస్సార్ పేరు వింటేనే కూటమి నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, అందుకే తొలగిస్తున్నారని ఎద్దేవా చేశారు. 'కూటమిలోని ఒక నాయకుడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశాడు. మరో నాయకుడు మతాలను రెచ్చగొడుతూ దక్షిణ భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాడు. ఇంకో నాయకుడు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు' అని పల్లా దుర్గారావు ఆరోపించారు.

23న సాహితీ సదస్సు



వివరాలు వెల్లడిస్తున్న కుసుమా చక్రవర్తి

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరులో వెలసిన జిల్లెళ్లమూడి అమ్మవారి ఆలయ రజతోత్సవాలు ఘనంగా జరపనున్నట్లు ఆలయ నిర్వాహకులు కుసుమా చక్రవర్తి తెలిపారు. ఆలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆలయం స్థాపించి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 23న ఆదివారం సాహితీ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారన్నారు. మాతృశ్రీ అధ్యయన పరిషత్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి, సహ కన్వీనర్‌గా ఎంఎస్ శరత్చంద్ర కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు.

కృష్ణా కళాశాలలో రక్తదాన శిబిరం రేపు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న నిర్వహించనున్న మహా రక్తదాన శిబిరంలో యువకులందరూ పాల్గొని జయప్రదం చేయాలని అగనంపూడి హోమీ బాబా హాస్పిటల్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వయోలా తెన్నేటి పిలుపునిచ్చారు. కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ రక్తదానం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయాలని, దానివల్ల మనిషి మరింత ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. దానం చేసిన రక్తనిధి ద్వారా మరెన్నో ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. విద్యార్థులందరూ రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమ అధ్యక్షుడు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, జి.వి.ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి వయోలా తెన్నేటి

చీటీల పేరుతో మోసగిస్తున్న మహిళపై ఫిర్యాదు

ఎంవీపీకాలనీ: శివాజీపాలెం, పెదవాల్తేరుతోపాటు అనేక ప్రాంతాల ప్రజల నుంచి చీటీలు కట్టించి మోసాలకు పాల్పడుతున్న సంచాన సరస్వతిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు డిమాండ్ చేశారు. ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో గురువారం మూకుమ్మడిగా ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు. సరస్వతి కొన్నేళ్లుగా నగరంలో వేరు వేరు ప్రాంతాల్లోని వ్యక్తుల నుంచి చీటీలు వేస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికి చీటీల వసూళ్ల బాధ్యతలు అప్పగించడం, వారి నుంచి కలక్షన్ చేసిన డబ్బులు తీసుకొని నిర్వహణ బాధ్యత, కేటాయింపులు వంటివి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నెలవారీ కలక్షన్ డబ్బులను చీటీలు పాడుకున్న వారికి సకాలం ఇవ్వకపోవడం, కొన్నిసార్లు తనకు సంబంధం లేదని చేతులెత్తేయడం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కారణంగానే కలెక్షన్ ఏజెంట్లుగా ఉన్న తామంతా అనేక ప్రాంతాల్లో బాధితులుగా మారామని వాపోయారు. కలక్షన్ డబ్బులు సభ్యులకు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడంతోపాటు సరస్వతి తమపై తిరిగి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమెపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేసిన వంగపండు సత్యనారాయణ, గుంటు కామేశ్వరి, ధర్మవరపు సూర్యనారాయణ, వి.కుమారి విజ్ఞప్తి చేశారు. పోలీస్ స్టేషన్ బయట ఆయా ఫిర్యాదుల ప్రతులను ప్రదర్శించారు.



ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎదుట ఫిర్యాదు పత్రాలు ప్రదర్శిస్తున్న బాధితులు

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో గురువారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. పుట్టిన నాటి నుంచి ఇంతవరకు ఆధార్ కార్డు నిమిత్తం నమోదు కాని పిల్లల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని న్యూ వెంకోజీపాలెం–106 సచివాలయం, మద్దిలపాలెంలోని 117 సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు. ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125 నంబర్ సచివాలయం, పాత రేసపువానిపాలెంలోని 138 నంబర్ సచివాలయంలోను శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. దక్షిణ నియోజకవర్గంలోని దొండపర్తిలో గల 143 నంబర్ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు తమ ఆధార్ కార్డులతో ఈ సచివాలయాల్లో ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

వయోవృద్ధుల సంక్షేమంపై దృష్టి సారించాలి

బీచ్‌రోడ్డు: వయోవృద్ధుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ఫెడరేషన్ ప్రబారీ అఖిల్ భారత ఉపాధ్యక్షుడు మళ్ల జగదీశ్వరరావు సూచించారు. రాజస్థాన్‌లో జరిగిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అఖిల భారత మహాసభలో విశాఖ నుంచి పాల్గొన్న ఆయన ప్రసంగించారు. వయోవృద్ధులకు రైల్వేలో రాయితీలను పునరుద్ధరించాలని, బ్యాంకు వడ్డీ శాతాన్ని పెంచాలని కోరారు. సీనియర్ సిటిజన్లు అందరికీ అయుష్మాన్ భారత్ పథకం అమలు చేయాలన్నారు.

22, 23 తేదీల్లో హస్తకళా ప్రదర్శన

సీతమ్మధార: ద్వారకానగర్ పవన్ షోరూం వెనుక రోడ్డులోని బా బాపు భవన్‌లో బా బాపూ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో హస్తకళా ప్రదర్శన నిర్వహించనున్నట్లు సంఘ ప్రెసిడెంట్ అంతర్వేది ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఔత్సాహిక మహిళలు వారి ఉత్పత్తులు ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. బ్లాక్ ప్రింటింగ్ వస్త్రాలు, పిండి వంటలు, మగ్గం వర్క్ వస్త్రాలు, చాక్‌లెట్స్, పచ్చళ్లు, రెడీమేడ్ దుస్తులు, చీరలు, మొక్కలు, గోమయంతో చేసిన ఉత్పత్తులు లభిస్తాయన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాఖ విద్య: యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆకాంక్షించారు. గురువారం తన కార్యాలయంలో హెచ్‌ఆర్‌ఎం విద్యార్థులను అభినందించారు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ లేబరేటరీ సంస్థలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి వారితో మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలని, యువత ఈ స్ఫూర్తిని తీసుకుని నూతన వ్యాపార అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షలో లెక్చరర్ షిప్‌కు అర్హత సాధించిన కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉద్యోగ పత్రాలను అందిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయరావు

టెన్త్ స్పాట్‌కు మినహాయింపు ఇవ్వాలి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ఏప్రిల్ 3 నుంచి జరగబోయే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు గురువారం డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పాట్ వాల్యుయేషన్‌లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, ఫిజికల్లీ, విజువల్లీ చాలెంజ్డ్, 58 ఏళ్లు నిండిన వారు, ఎంఆర్ పిల్లలున్న వారికి, లాక్టేటెడ్ మదర్స్‌కు వ్యక్తిగత లెటర్లు తీసుకొని ముందుగానే వారి కోరిక మేరకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనిపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చినట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ తెలిపారు. జిల్లా కోశాధికారి కె రాంబాబు, కార్యదర్శి టి.జగన్ పాల్గొన్నారు.

మరింత ముందుకు విజ్ఞాన శాస్త్రం

మద్దిలపాలెం: అంతరిక్షం నుంచి భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీత విలియమ్స్‌తోపాటు సహచార వ్యోమగామి బుచ్ విల్‌మోర్ క్షేమంగా భూమికి తిరిగి రావడం విజ్ఞాన శాస్త్రం సాధించిన మరో విజయమని రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఓబీసీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి మూల వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతరిక్షంలో ఉండిపోయినప్పటికీ వారు తొమ్మిది నెలల కాలంలో దిగులుతో కూర్చుండిపోలేదన్నారు. భావితరాలకు ఉపయోగపడే ఎన్నో ప్రయోగాలు నిర్వహించారని చెప్పారు. వ్యోమగామిలను తిరిగి తీసుకురావడానికి భూమి మీద ఉన్న సహచరులు చేస్తున్న ప్రయత్నాలు, విజ్ఞాన శాస్త్రంపై వారికి తిరుగులేని నమ్మకమే ఈ విజయానికి కారణమన్నారు. విజ్ఞాన శాస్త్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి భావితరాలకు అందించే క్రమంలో ఎదురైన ఆటంకాన్ని సునీత విలయమ్స్, బుచ్ విల్‌మోర్‌లు ఇతర శాస్త్రవేత్తల సహకారంతో సమర్థంగా ఎదుర్కొన్న తీరుకు జేజేలు పలికారు. రాష్ట్ర ప్రజల తరఫున వ్యోమగామిలిద్దరికి గౌరవ వందనాలు సమర్పించారు.